

'జగనన్న తోడు' నిధులు జమ

చెక్కు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : జగనన్న తోడు చిరు వ్యాపారుల ఉపాధికి, ఆర్థిక అభివృద్ధికి ఎంతో ఉపయోగ పడుతుందని కలెక్టర్ ఎం హరి నారాయణన్ పేర్కొన్నారు. మంగళవారం సిఎం చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాన్ని (జగనన్న తొడు)క్యాంపు కార్యాలయంనుంచి బటన్ నొక్కి వారి ఖాతాలలో జమ చేశారు. జిల్లాలో 19085 మంది చిరువ్యాపారులకు సంబంధించిన రూ.19.08 కోట్ల మెగా చెక్కును తిక్కన ప్రాంగణంలో కలెక్టర్, ఎంఎల్‌సి చిరువ్యాపారులకు అందజేశారు. కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ ప్రభుత్వం చిరు వ్యాపారులకు, సాంప్రదాయ వత్తుల వారి ఉపాధి కల్పనకు, ఆర్థికంగా అభివద్ధి చెందడానికి జగనన్న తొడు పథకం ప్రవేశ పెట్టిందన్నారు .దీనివల్ల వేలాదిమంది చిరు వ్యాపారులు తమ జీవనోపాధిని మెరుగు పరచుకోవడానికి అవకాశం కలిగిందన్నారు. చిరు వ్యాపారులు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను కలెక్టర్ హరి నారాయణన్ ,ఎమ్మెల్సీ కళ్యాణ చక్రవర్తి పరిశీలించారు.

రోడ్లు అద్దంలా..అందంగా మారెనోయ్..!

17న అంతా ఇలాగే ఉండాలన్న సిఎం - నాలుగేళ్ల నుంచి అతిగతి లేదు..

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు ఒక్కటేనని చెబుతున్నా ఆచరణలో పనులు జరగడం లేదు. ఇప్పటి వరకు సంక్షేమం పేరుతో వివిధ రకాల వర్గాలకు పెద్ద ఎత్తున నిధులు అందజేశారు. రోడ్లు, డ్రెయినేజీ, కాలువలు ఇతర పనులకు పెద్దగా నిధులు కేటాయించలేదు. నాలుగేళ్ల నుంచి జిల్లాలోని అనేక రోడ్లు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. ఇటీవల మూడు నెలల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. " జులై17 నాటికి రాష్ట్రంలోని అన్ని రోడ్లు అద్దంలా...అందంగా మార్చాలి " అని చెప్పారు. ప్రజలందరూ జరిగిపోతుందని భావించారు. అధికారులకు నిధుల్లేక, రాక ప్రజలకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి ప్రజలు రోడ్లపై ప్రయాణం చేయలేక నానా అవస్థలు పడుతున్నారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి అయిందని చెప్పడానికి అక్కడ మౌలిక వసతులు, రోడ్లు, డ్రెయినేజీ, మంచినీరు,. వంటివి ప్రధానమైనవి. 2019 అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. సంక్షేమ పథకాలు ఆగకుండా, ఉన్నంతలో కొంత అటు, ఇటుగా ఇస్తున్నారు. నాలుగేళ్ల నుంచి జిల్లాలోని రోడ్ల మరమ్మతులకు నోచుకోలేదు. ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో కొన్ని ప్రాంతాల్లో గ్రావెల్, మరికొన్ని ప్రాంతాల్లో కంకర్ వేసి తూతూ మంత్రంగా అనిపించారు. నెల్లూరు నగరం నుంచి గొల్లకందుకూరు వరకు 27 కిలో మీటర్ల రోడ్లు అత్యంత దారుణంగా మారాయి. వర్షాలు రావడంతో మరింత దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదు . నెల్లూరు నుంచి జొన్నవాడ, నరసింహకొండ, ములుమూడి, మోపూరు, కందమూరు, పాత ఎల్లంటి, కొత్త ఎల్లంటి, సజ్జాపురం, గ్రామాలకు నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. ఇక్కడ రోడ్ల మరమ్మతులకు నోచుకోకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్ల ప్రాంతాల్లో సుమారు 30 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఇవి ప్రభుత్వ పనితనానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పలుమార్లు ఈ రోడ్లకు నిధులు ఇవ్వాలని సిఎంను కలిసినా పని జరగలేదు. ఇదే కాకుండా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఓజిలి- గునుపాడు, నాయుడుపేట-కోట రోడ్లతోపాటు అనేక గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. ఇటీవల కాలంలో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో కొన్ని చోట్ల గ్రావెల్, మరికొన్ని చోట్ల కంకర వేసి రోడ్ల వేశామని చెప్పుకుంటున్నారు. ఇప్పట్లో ఈ రోడ్ల మరమ్మతులకు నోచుకునేలా కనపించడం లేదు. నెల్లూరు నగరంలో మరీ దారుణంగా ఉంది. అపోలో సెంటర్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్లు మొత్తం గుంతలు పడిపోయాయి. ప్రతి రోజూ పదిలారీలు గుంతల్లో చిక్కుకుపోతే జెసిబిలు అక్కడే పెట్టుకొని, ఒక్క గంటకు రెండు వేల రూపాయల చొప్పున వ్యాపారాలు సాగించారు. భారీ వాహనాలు రాకుండా చేయడానికి మున్సిపల్ అధికారులు నిధులు ఖర్చుపెట్టి కాంక్రీట్ హైలెవల్ గేట్ ఏర్పాటు చేశారు. ఈ రోడ్డును వెంటనే పూర్తి చేస్తామని రూ.68 లక్షలతో మంత్రి శిలాఫలకం వేశారు. కాంక్రీట్ వేశారు తప్ప రోడ్డు మాత్రం వేయలేదు. రాష్ట్రంలో ఉన్న రోడ్ల దుస్థితిపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడు నెలల క్రితం ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జులై 17 నాటికి రోడ్లు అందంగా, అద్దంలా మారాలని అదేశాలు జారీ చేశారు. ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితులున్నాయి. ప్రభుత్వ తీరుపట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం. హరినారాయణన్

ఓటర్లు జాబితా పక్కాగా సిద్ధం చేస్తాం..

కలెక్టర్ ఎం.హరినారాయణన్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ప్రత్యేక ఓటరు సవరణ, నమోదు కార్యక్రమాన్ని పటిష్టంగా చేపడుతూ పక్కాగా ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎం.హరి నారాయణన్ పేర్కొన్నారు. మంగళవారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి కలెక్టర్ హరినారాయణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యక్రమం, ఫామ్ 6, 6ఎ, 7, 8 నమోదు వివరాలను సిఇఒకు కలెక్టర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 26,488 ఓటరు క్లెయిమ్స్ వచ్చాయి. 12,885 క్లెయిమ్స్ ను ఓటరు జాబితాలో అప్‌డేట్ చేయగా, 10,397 పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఫామ్-6కు సంబంధించి 14,769 దరఖాస్తులు వచ్చాయి. ఫామ్-6ఎకు సంబంధించి ఒకటి, ఫామ్-7కు సంబంధించి 5,832 దరఖాస్తులు వచ్చాయి. ఫామ్-8 కు సంబంధించి 5886 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఓటరు చేర్పులు, మార్పులకు సంబంధించి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో ఓటర్ జాబితాను పక్కాగా రూపొందించేందుకు అవసరమైన కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వివరించారు. డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, జెడ్‌పిసిఇఒ చిరంజీవి, డ్వామా పీడీ వెంకట్రావు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆగ్రహం..!

పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట ధర్నా

డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు

ప్రజాశక్తి-నెల్లూరు :ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయిం చరాదని, ప్రభుత్వం నాసిరకమైన సెల్‌ఫోన్లు, 2 జి సిమ్‌లు ఆశా వర్కర్లకు అందజేసి 14 రకాల యాప్‌లతో ఆన్‌లైన్‌లో పని చేయా లంటూ వారిపై పనిభారం పెంచడంపై ఆశా వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వం ఆశాలకు యాప్‌ల పేరుతో పని ఒత్తిడి పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఛలో డిఎంఅండ్‌హెచ్ఒ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ములుమూడి బస్టాండ్ ప్రాంతం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వరకు ఆశా వర్కర్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా చేపట్టారు. ధర్నాకు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి ప్రభుత్వం 50 ఇళ్ళకు ఒక వాలంటీర్‌ను నియమించి వారికి ఇస్తున్న గౌరవ వేతనం వేల మందికి వైద్య ఆరోగ్యసేవలం దించడంలో కీలక భూమికను పోషిస్తున్న ఆశాలకు ఇవ్వకపోవడం దుర్మార్గ మన్నారు. ఆశాలు చేస్తున్న సర్వేల వల్ల ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదన్నారు. ఆశా వర్కర్స్‌కు పనిభారం తగ్గించాలని, అర్హులైన ఆశా వర్కర్స్‌కు ఎఎన్ఎంలుగా అవకాశం కల్పించాలన్నారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాటాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని పలు మార్లు అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. ఆన్‌లైన్ వర్క చేయించడమే కాకుండా 27 రికార్డులు ఆశాలచేత రాయించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్లు మాత్రం 50 ఇళ్లకు సేవలు చేయాలి,ఆశాలు మాత్రం 200ఇళ్లకు సేవలందించాలి.. ఇది ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. వాలంటీర్లు మనుషులు, ఆశాలు మనుషులు కాదా అన్నారు. ప్రభుత్వం ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, కె.పెంచలనర్సయ్య, జి.నాగేశ్వరరావు, రాజా, గౌస్ ,షాహీనాబేగం,ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యమ్మ, భ్యాగరేఖ, రేణుక, మధుసూధన ఉన్నారు.

అయోర్లు..తాటతీస్తా..

నా సంగతి తెలిసిందేగా.. ఎంఎల్ఎ అనిల్ హెచ్చరికలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

" అయ్యోర్లు నెల్లూరు సిటీలో ఓట్లు చేర్పించడానికి వస్తున్నారని, నాకు సమాచారం వచ్చింది. నా అభిమానులు నాకు చెప్పారు. ఇదే జరిగితే ఒక్కొక్కరి తాట తీసేస్తా...నా సంగతి తెలిసిందేగా " అంటూ నెల్లూరు సిటీ ఎంఎల్ఎ పి.అనిల్‌కుమార్‌యాదవ్ రెచ్చిపోయారు. మంగళవారం నగరంలోని 48వ డివిజన్‌లో జరిగిన ఓ కార్యక్రమం తరువాత మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు ఇది చర్చనీయాంశమైంది. ఆలూ లేదు, సూలు లేదు అన్నట్లు ఎన్నికల హడావుడి ప్రారంభం కాలేదు. ఎవరో చెప్పారని, ఉపాధ్యాయులను ఇలా బెదిరించడం పట్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు సిటీ నుంచి టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి పి. నారాయణ పోటీ చేయనున్నారు. రాష్ట్రంలోని నారాయణ కాలేజీలో పనిచేసే ఉపాధ్యాయులు నెల్లూరు వచ్చి దొంగ ఓటర్లు చేర్పిస్తున్నారని, ఈ విషయంలో అక్కడ

మాట్లాడుతున్న ఎంఎల్‌శ్రీ పి. అనిల్‌కుమార్‌యాదవ్

పనిచేసే ఉపాధ్యాయులే తనకు తెలిపారన్నారు. గతంలో కూడా ఇలాగే ఓట్లు చేర్పించారని, నెల్లూరు నగరంలో దొరికే అయ్యోరుకు తాటతీసేస్తానని తీవ్రంగా హెచ్చరించారు. నాకు వచ్చినా పేరు ఎలాగు ఉందని, నా సంగతేమిటో చూపిస్తానని రెచ్చిపోయారు. మీ పని మీరు చూసు కోవాలని, రాజకీయాల జోలికి రావద్దని హెచ్చరించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి ఇలా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది.

ప్రతిష్టాత్మకంగా రొట్టెల పండుగ : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు :బారాషాహిద్ దర్గా ప్రాంతంలో ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రొట్టెల పండుగను నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు.రొట్టెల పండుగ నిర్వహణ ఏర్పాట్లను బారా షహీద్ దర్గాలో కమిషనర్ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న భక్తులను దష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. షామియనాలు, కమాండ్ కంట్రోల్ విభాగం, వి.ఐ.పి రిసెప్షన్, సి.సి కెమెరాలు, విద్యుత్ లైటింగ్, పారిశుద్ధ్యం, స్త్రీలకు మరుగుదొడ్లు, పార్కింగ్, మహిళలకు రక్షణ, బారికేడ్ల నిర్మాణం, పోలీసుల పర్యవేక్షణ, స్వర్ణాల చెరువు తీరం వెంబడి భద్రతా చర్యలు వంటి వివిధ అంశాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు.కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం : కాకాణి

-వెంకటాచలం :మండలంలోని నిడిగుంటపాలెంలో దశాబ్దాల కాలంగా పెండింగ్ లో ఉన్న చుక్కల భూముల సమస్యకు పరిష్కారం చూపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలంలోని నిడి గుంటపాలెం గ్రామంలోని రైతులకు చుక్కల భూమి నుంచి విముక్తి కలగలేదని, దీంతో ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడి ఈ గ్రామంలోని 300 ఎకరాల భూములను చుక్కల భూముల నిషేధిత జాబితా నుంచి తొలగించి, పట్టాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రైతులకు చుక్కల భూమి నుంచి విముక్తి కల్పించి, ధ్రువీకరణ పత్రాలను ౕ లబ్ధిదారులకు సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు.

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-ఉలవపాడు : మండల పరిధిలోని ఆత్మకూరులో పాఠశాలను మంగళవారం ఎంఇఒ ఎం.వి.వి ప్రసాద్ రావు తనిఖీ చేశారు. రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టిలను పరిశీలిం చారు. పిల్లలకు ఇచ్చే రాగి జావాను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు :సబ్ జూనియర్ బాలుర బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు సభ్యులను మంగళవారం ఎంపికైనట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి టి సుబ్బారావు తెలిపారు. కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మంగళ వారం జరిగిన జట్ల ఎంపికకు సుమారు 30 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో అత్యంత ప్రతిభ కనపరిచిన 12 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన జట్టు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం లో జరిగే ఎనిమిదో సబ్ జూనియర్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ సురేష్, సెక్రెటరీ టి సుబ్బారావు, పీడీలు శ్రీనివాసరావు, నరసింహం, రవీంద్ర ఉన్నారు.

ముంపు బాధితులపై నిర్లక్ష్యం సరికాదు

ప్రజాశక్తి -పొదలకూరు : తెలుగు గంగ ముంపు బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బిజెపి రాష్ట్ర నాయకులు మడతల రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడారు. కండలేరు ముంపు వాసులకు జిఒ నెంబర్ 98 ప్రకారం ప్రతి ఇంటికి ఓ ఉద్యోగం కల్పనను ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ ఆ సమస్యకు పరిష్కారం చూడాలన్నారు. పొదలకూరు మండల అధ్యక్షులు అయోధ్య రామయ్య, చింతగింజల సుబ్రమణ్యం, ధనుంజయ, ప్రశాంత ఉన్నారు.

వైసిపి జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి -తోటపల్లి గూడూరు :పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపికి అండగా నిలుస్తూ వచ్చిన మండలంలోని సౌత్ ఆము లూరులో వైసిపి పతాకం ఎగిరింది. మంగళవారం మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ గ్రామంలో 90 శాతానికిపైగా ప్రజలు నారా చంద్రబాబు నాయుడు సామా జిక వర్గానికి చెందిన వారు. దీంతో వారంతా టిడిపికి అండగా నిలిచేవారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచనలతో వైసిపి రాష్ట్ర కా ర్యదర్శి, విజయడైరీ మాజీ చై ర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి చొరవ వల్ల సౌత్ ఆములూరులో టిడిపి ముఖ్య నేతలు తమ అనుచరులతో కలసి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సమక్షం లో వైసిపి తీర్థంపుచ్చుకున్నారు. పతాకావిష్కరణలో చిల్లకూరు సుధీర్ రెడ్డి, వైసీ పీ జిల్లా అధికార ప్రతినిధి తల మంచి సురేంద్ర బాబు, మండ ల ఉపాధ్య క్షులు చెరుకూరు శ్రీ నివాసులు నాయుడు, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, వైసీపీ కన్వీ నర్ శంకరయ్య గౌడ్, జెడ్పిటిసి శేషమ్మ, మాజీ జెడ్పిటిసి చిరం జీవి గౌడ్ ఉన్నారు.

కాలువల్లో పూడిక తీత

నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనులలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డ్రైను కాలువల్లో పూడికతీత పనులను క్రమంతప్పకుండా చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 13వ డివిజనులో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ మంగళవారం పర్యవేక్షిం చారు. వర్షా కాలాన్ని దష్టిలో ఉంచుకుని నగర వ్యాప్తంగా ఉన్న అన్ని డ్రైను కాలువల్లో పూడికతీత పనులను క్రమంతప్పకుండా నిర్వహిస్తూ, సిల్టు వ్యర్థాలను ఎప్పటి కప్పుడు తొలగించేలా పర్యవేక్షించాలని అధికారులు, సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ నాగార్జున, నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ ఉన్నారు.

ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలో ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలాలు చూపించాలని, ఆటో కార్మికులపై వేధింపులను నివారించాలని జిల్లా ఆటో కార్మిక సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లా ఆటో కార్మిక సంఘం (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో బారాషాహీద్ దర్గా ప్రాంతం నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆటో కార్మికులు ధర్నా చేపట్టారు. యూనియన్ గౌరవాధ్యక్షులు జి నాగేశ్వరరావు మాట్లాడుతూ నగర నియోజకవర్గ పరిధిలో 10 వేల మందికి పైగా ఆటో కార్మికులు ఉన్నారన్నారు. డిగ్రీలు ,పోస్ట్ గ్రాడ్యుయేట్లు పూర్తి చేసిన నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో ఏ దారి లేక ఆటో రంగాన్ని ఉపాధిగా ఎంచుకున్నారన్నారు. ఫైనాన్స్ అప్పులతో,పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. 24 గంటలు ప్రజలందరికీ రవాణా సౌకర్యం అందించడంలో నగరంలో ఆటో కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని వేధింపులకు గురిచేస్తుందన్నారు. ఈ క్రమంలో నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో సిఐటియు ఆటో స్టాండ్‌కు సంబంధించిన బోర్డును దౌర్జన్యకరంగా తొలగించారన్నారు. అడ్డుకొనేందుకు ఆటో కార్మికులు ప్రయత్నిస్తే 'మీరందరూ నగర ఎంఎల్ఎని కలిసి మాట్లాడాలి అని చెప్పడం సరికాదన్నారు. ఒక బాధ్యత కలిగిన ఐఎఎస్ అధికారి అధికార పార్టీకి చెందిన ఎంఎల్ఎను కలవమని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా నగరంలో ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలాలు చూపించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి సూర్యనారాయణ, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్, సిఐటియు నగర కోశాధికారి బి రాంబాబు, జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజా,కె సురేష్, నగర అధ్యక్షులు నాగూర్,బాబురావు ,మురళి,హబీబ్, జగదీష్, వేణు, రత్నం పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి-నెల్లూరు : వైసిపి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను గాలి కొదిలేసిందని, ప్రభుత్వం తక్షణమే విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం నిర్వహిస్తామని ఎఐఎస్ఎఫ్ హెచ్చరించింది. మంగళవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్ఒకి వినతి పత్రం అందజేశారు. ఎఐఎస్ఎఫ్ నెల్లూరు జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వేల లక్షల కోట్ల రూపాయలు విద్యార్థుల సంక్షేమం కోసం ఖర్చు పెడుతున్నామని ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గహాలలో కనీస మౌలిక వసతులు కూడా లేని చాలా వసతి గహాలు ఉన్నాయని నడి బొడ్డులో గల కొండాయపాలెం గేట్ ఎస్సీ బాలుర వసతి గహం లోని సదుపాయాలు చూస్తే ప్రభుత్వ డొల్లతనం అర్థమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వసతి గహాల యందు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏ విధంగా పెరిగిన నిత్యవసరలకు అనుగుణంగా మెస్ బిల్లులను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కిషోర్,కావలి నియోజకవర్గం కార్యదర్శి దినేష్ కుమార్, నెల్లూరు నగర అధ్యక్షుడు శివం వర్మ,నెల్లూరు రూరల్ నగరం కోవూరు కావలి ప్రాంతాల నాయకులు వరుణ్, స్వరూప్, లీలాష్, ఆకాష్, జీవన్,సాయి, కిషోర్ ఉన్నారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజా సమస్యలకు సంతప్తికర స్థాయిలో పరిష్కారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన "జగనన్న సురక్ష" పథకంతో అర్హులందరికీ సంక్షేమం సాధ్యమని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం నగర నియోజకవర్గం పరిధిలోని 8, 50, 52వ డివిజనుల్లోని సచివాల యాలు, రూరల్ నియోజకవర్గం పరిధిలోని 20, 31 డివిజనుల్లోని సచివాలయాల్లో ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, స్థానిక డివిజనుల కార్పొరేటర్లు, వైఎస్సార్ సిపి నాయకులు, నగర పాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అదనపు కమిషనర్, టి.పి.ఆర్.ఓ, అన్ని విభాగాల అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుర్రం వారిపాలెం సచివాలయం లో జరిగిన సభ జరిగింది. జె సి యస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధ్రువపత్రాలను సచివాలయం వద్ద ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందించాలని ధ్రుఢ సంకల్పంతో ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి కందుకూరు మున్సిపాలిటీ సచివాలయం క్యాంపు ద్వారా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇ రామమూర్తి, ఉప్పుటూరి నాగేశ్వరరావు సచివాలయం కన్వీనర్లు గహ సారథులు వాలంటీర్లు పాల్గొన్నారు.

పొదలకూరు :మండలంలోని నావూరు సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపు మంగళవారం జరిగినది. జూలై 11వ తేదీ నుంచి వారం రోజుల పాటు వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి జల్లెడ పట్టి కావాల్సిన సర్వీసులు వారి ముంగిటికి చేర్చడం ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కారక్రమానికి ఎం .పి. టీ.సి నోటి సబ్బరత్నమ్మ, నావూరు , నావూరుపల్లి, చెన్నారెడ్డి పల్లి పంచాయతీ ల సర్పంచ్ లు బొడ్డు జయమ్మ, గాలం వెంగయ్య, ఏనిమిరెడ్డి భాగ్యలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ గణేష్ నాయకులు సుబ్బారెడ్డి, హరి, నర్సింహులు, బాలకొండారెడ్డి ఉన్నారు.

కందుకూరులో..

వెంకటాచలం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్య మని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కసుమూరులో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. లబ్ధిదారులకు రేషన్ కార్డులు, ఆదాయ, కుల, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహశీల్దార్ కష్ణయ్య, ఎంపీపీ మంద కవిత యంపి టి సి కవిత, సర్పంచ్ శివ కోదండ రామిరెడ్డి మాజీ జెడ్పిటిసి మండల వెంకట శేషయ్య ఉన్నారు.

టిడిపి విజయానికి కృషి

కార్యకర్తలతో కోటంరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :ఎప్పుడు ఎన్నికలు జరిగినా టిడిపి విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కార్యాలయంలో బూత్ లెవల్ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా భేటి అయ్యారు. నారా చంద్ర బాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలు ఎప్పుడు ఏ అవసరం వచ్చిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అండగా ఉంటారని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.అన్నారు. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్లపాక.అనురాధ, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, బొకేతో సత్కరించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం లో మహిళా విభాగాన్ని బలోపేతం చేసేందుకు తనవంతు కషి చేస్తానన్నారు.

మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 21/3 మాగుంట లే అవుట్ సచివాలయాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని ఇన్వెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. ఈ నెల 20 వ తేదీ నుంచి సచివాలయం పరిధిలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమ ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా నిర్వహిం చాలని, జగనన్న సురక్ష పథకం పారదర్శకంగా అందరికీ చేరువయ్యేలా సచివాలయం సెక్రెటరీలు కషి చెయ్యాలి అని కమిషనర్ సూచించారు. ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలు : టిడిపి

ప్రజాశక్తి -వెంకటాచలం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో విచారిస్తే వైసిపి నాయకుల అవినీతి బట్టబయల వుతుందని మండల టిడిపి అధ్యక్షుడు గుమ్మాడ్ రాజా యాదవ్ ఆరోపించారు. వెంకటాచలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గడిచిన నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో వెంకటాచలం మండలంలో జరిగిన, జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి చోటు చేసుకుందన్నారు. ప్రజలకు, రైతులకు, గ్రామస్తులకు ఉపయోగపడే పనులు చేయకుండా వైసిపి నాయకులకు పనికొచ్చే పనులే చేస్తున్నారన్నారు. సీనియర్ నాయకులు డబ్బుగుంట సురేంద్ర, పఠాన్ ఖాయ్యూమ్ ఖాన్, ఆకుల రమణయ్య, కడివేటి శేషయ్య ఉన్నారు.

అభివృద్ధి పనులపై సూచనలు

ప్రజాశక్తి-నెల్లూరు :సుస్థిర నగరాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం నగర పాలక సంస్థలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ విభాగం నుంచి ఈ వీడియోకాన్ఫరెన్స్‌కు కార్పోరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు. సుస్థిర నగరాల అభివద్ధి అంశంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.కోటేశ్వరరావు పట్టణ పర్యావరణాన్ని పెంపొందించే ప్రణాళికలు, వాటి నిర్వహణ అంశాలపై అధికారులతో చర్చించారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, ఇతర విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి -పొదలకూరు : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పెంచలయ్య, జిల్లా టిబీ నియంత్రణ అధికారి అమరేంద్ర నాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రధానమంత్రి టిబి ముక్తాభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహ్మాదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో టిబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి రమేష్ డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ దయాకర్ అందజేశారు. వైద్యాధికారికిరణ్ రిషిత, పొదలకూరు టిబీ యూనిట్ సూపర్వైజర్ వి.శబరినాథ్ ఉన్నారు.

గ్రావెల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక డిమాండ్

ప్రజాశక్తి-కావలి : కావలి ముసునూరు ఇందిరమ్మ కాలనీ వద్ద అక్రమంగా తవ్వుతున్న గ్రావెల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామిక హక్కుల రక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు గ్రావెల్ తవ్వకాలను వేదిక పరిశీలించింది. విచ్చల విడిగా గ్రావెల్ తవ్వకాలు జరిగాయని వేదిక అభిప్రాయ పడింది. జగనన్న లేఅవుట్ కోసం చదును చేస్తున్నామని పేరుతో గ్రావెల్, మైనింగ్, వేదిక అభిప్రాయపడింది. అక్రమ గ్రావెల్ తవ్వకాల వల్ల ప్రజల నివసిస్తున్న ఇళ్లు కూడా ప్రమాదాల బారిన పడుతున్నాయని వేదిక అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు కరవది భాస్కర్ మాట్లాడుతూ గ్రావెల్ మాఫియా అక్రమార్కులు బరితెగించారని, ప్రజల నివాసాలను కూడా వదలట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అభ్యంతరాలను తెలియజేస్తున్న ఖాతరు చేయకుండా గ్రావెల్ మాఫియా విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వుతున్నారన్నారు. ఇంత విచ్చలవిడిగా గ్రావెల్ మాఫియా అక్రమార్కులు బరితెగిస్తుంటే చూసి చూడనట్లు నిద్ర నటిస్తున్నారని తెలిపారు. ఎంఎల్ఎ గ్రావెల్ మాఫియాకు అండగా ఉన్నారని ఆరోపించారు. వేదిక సభ్యులు పసుపులేటి పెంచలయ్య(సిపిఎం), వేదిక నాయకులు దేవకుమార్, పొబ్బసాయి విటల్, గడే నాగార్జున, అబ్దుల్ హఫీజ్, తదితరులున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : స్థానిక బాపూజీ నగర్‌లోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం, ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహాల ప్రాంగణంలో సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో "బాల్య వివాహాల నిర్మూలన, తల్లిదండ్రుల బాధ్యత, టెలివిజన్ ద్వారా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి డివిజన్ బీసీ సహాయ సంక్షేమాధికారి కె.సుధాకర్ ముఖ్య అతిథిగా విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి, షేక్ ఖాదర్ బాషా, విశ్రాంత లెక్చరర్ ఎం.వి.ఎన్.ప్రసాద్ రావు, విశ్రాంత హెచ్ఎం ఎం.అజిత్ బాబు, గౌరవ అతిథులుగా హాజరయ్యారు. వార్డెన్లు నాగేశ్వరి, విజయలక్ష్మి, సిబ్బంది సహకారం అందించారు.

ఎంఇఒకు సత్కారం

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లిన మాలకొండారావును మంగళవారం మండలంలోని ఉపాధ్యాయ బృందం, సిఆర్‌పిలు, ఆఫీసు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఇఒ-1 నజీర్ భాషా మాట్లాడుతూ మాలకొండరావు ఎంతో నిబద్ధతతో అంకిత భావంతో ఉన్నత వ్యక్తిత్వంతో మండలంలో అందరి అభిమానాన్ని చూరగొన్నార న్నారు. ఎంఇఒ-2 ధనలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయుల మనసుల్లో ఇంతటి అభిమానాన్ని సంపాదించుకోవడం మాలకొండరావుకే దక్కిందన్నారు. అనంతరం మండలంలోని ఉపాధ్యాయ బృందం, సిఆర్‌పిలు, ఆఫీస్ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మర్రిపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, నందవరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పొంగూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం, చిలకపాడు ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, కంపసముద్రం పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, మర్రిపాడు ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్‌పి మిత్రులు, ఆఫీస్ సిబ్బంది, తదితరులున్నారు.

రోడ్ల మరమ్మతులను మరచిన సిఎం

ప్రజాశక్తి-కావలిరూరల్ : జనంలోకి జనసేన 119రోజు కావలి రూరల్ మండలంలోని సర్వాయపాలెం గ్రామంలో జనసేన నాయకుడు సిద్దు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జూలై 15వ తేదికి రోడ్ల మీద గుంతలు కనిపించవని చెప్పిన ముఖ్యమంత్రి ఈ సంవత్సరం జూలై 15 కూడా వచ్చిందని, కావలి నియోజకవర్గంలో మాత్రం ఇంకా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. రోడ్లు బాగు చేయాలని అనేక సార్లు నిరసన తెలిపినా స్థానిక ఎంఎల్ఎకు చలనం లేదన్నారు. సుభాని, పుల్లయ్య, మనోజ్, రియాజ్, మన్సూర్, హర్షద్, చందు, నశుల్ల, వెంకటకృష్ణ, సాయి, బాలు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉదయగిరి జిల్లా సాధన కమిటీ వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ఉదయగిరి జిల్లా సాధన కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం స్థానిక పెట్రోల్ బంకు ఆవరణలో నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డిని ఉదయగిరి జిల్లా సాధన కమిటీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వేణుగోపాల్, దస్తగిరి అహ్మద్ కమిటీ సభ్యులు కలిసి జిల్లా సాధన కోసం వినతిని అందజేసి ఈ సందర్భంగా వారు జిల్లా ఆవశ్యకతను గురించి వివరించారు. జిల్లా సాధన కమిటీ ఉపాధ్యక్షులు గాజులపల్లి రామిరెడ్డి, కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, వి కె దాదా, నెల్లూరు జిల్లా కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, నెల్లూరు జిల్లా పార్లమెంటరీ జనరల్ సెక్రెటరీ గోగుల వెంగళరెడ్డి, మాజీ సర్పంచ్ అంబటి సుబ్బారెడ్డి, తిరుమలాపురం మాజీ సర్పంచ్ బాలిబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు చిలకల మాలకొండ రెడ్డి, శేషారెడ్డి, సుభహాన్, గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

జనసేనాని చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి అనంతరం పవన్ కళ్యాణ్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి గుమ్మడికాయను దిష్టి తీశారు. కార్యక్రమంలో నియోజవర్గం ఇంచార్జ్ నలిశెట్టి శ్రీధర్, నాయకులున్నారు.

మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలి

పలుచోట్ల మహిళల పోరుయాత్ర

కావలిలో

ప్రజాశక్తి-కావలి

దేశంలోనూ, రాష్ట్రంలోనూ, జిల్లాల్లోనూ చిన్నారులు మహిళలపై రోజురోజుకు హింస విపరీతంగా పెరిగి పోతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై నిర్లక్ష్య ధోరణితో ఉన్నారని, అందుకే ఐద్వా ఆధ్వర్యంలో "మహిళల పోరు యాత్ర" నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 16వ తేదీన నెల్లూరు నుంచి బయల్దేరిన జీపుజాతా మంగళవారం కావలికి చేరుకుంది. ఈ సందర్భంగా ఉదయగిరి బ్రిడ్జి సెంటర్లో వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు, ప్రజలు, మహిళా సంఘాలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై వారి విలువైన భవిష్యత్తును కోల్పోతున్నారని, నైతిక విలువలు మరిచి, వావివరసలు విడిచి, అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ మధ్య కాలంలో నెల్లూరు జిల్లాలో మర్రిపాడులో స్నేహం పేరుతో మహిళపై అత్యాచారం, భవన నిర్మాణ కార్మికురాలికి ఆరోగ్యం బాగా లేకపోతే సహాయంగా వచ్చిన చెల్లెలు రాత్రి 11 గంటలకు మందుల కోసం బయటకు వెళితే, ఆటోలో తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం, ఇందుకూరుపేట చర్చిలో పాస్టర్ మహిళపై అత్యాచారం, తూర్పు చెన్నంపల్లిలో ఆశ వర్కర్‌పై లైంగిక వేధింపులు, బాలికలపై చిన్నారులపై కార్పొరేట్ స్కూల్లో గురువులే లైంగికంగా వేధింపులకు అత్యాచారాలకు గురవుతున్నారన్నారు. బుజబుజ నెల్లూరులో 9వ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం, యూసఫ్ దాడి, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంఘటనలు ఉన్నాయని వీటన్నిటికీ ప్రధాన కారణం మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల చిత్రాలు, అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు మద్యపాన నిషేధం చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమారి, మస్తాన్‌బీ, నాయకులు కత్తి పద్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి రెహనాబేగం, యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు శ్రీదేవి, మహిళలు వసుంధర, అనిత, జ్యోతి, ఆదిలక్ష్మి, గద్దె రగమ్మ, తదితర నాయకులున్నారు.

కొడవలూరులో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోనె దయాకర్, తిరకాల దయాకర్, ఐద్వా నాయకులు, తదితరులు మహిళల పోరుయాత్రను నిర్వహించారు.

ప్రజాశక్తి-గుడ్లూరు : మద్యం మత్తు పదార్థాలను నిషేధించాలని మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్కె మస్తాన్ బి డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో మహిళా పోరు యాత్ర మంగళవారం గుడ్లూరులో జరిగింది. రెవెన్యూ కార్యాలయం దగ్గర నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఐద్వా మండల కార్యదర్శి శంకర విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక మహిళలు యాత్రకు ఘనస్వాగతం పలికారు. బస్టాండ్ సెంటర్లో జిల్లా ఐద్వా మహిళా సంఘం నాయకురాలు ప్రసంగించారు. ప్రజానాట్యమండలి కళాకారులు గీతాలు ఆలపించారు. నాయకులు శివకుమారి ఎస్.కె షంషాద్ ప్రమీల వివరించారు. స్థానిక మహిళలు ఎస్ విజయలక్ష్మి నారాయణమ్మ కే ప్రసన్న భవాని విజయ వెంకయమ్మ ఉన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు : ప్రభుత్వాలు ఎన్ని మారినా మహిళల సమస్యలు పరిష్కారం కాలేదని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి.శివకుమారి పేర్కొన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో హింసపై మహిళా పోరుయాత్ర పేరుతో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతా మంగళవారం ఉలవపాడు చేరుకుంది. సిఐటియు జిల్లా నాయకులు జివిబికుమార్ మాట్లాడారు. జాతాలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె.మస్తాన్ బి, కత్తి పద్మ, ఎస్ కె మున్నార్ సుల్తానా, శంషాద్, ఐద్వా కందుకూరు డివిజన్ నాయకులు ఎస్ కే మల్లికా పద్మ, అస్మా, సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, మండల సిఐటియు నాయకులు సిహెచ్ ఇందిరావతి, తిరుపతమ్మ, పార్వతీ, గీత, ఐద్వా మండల నాయకులు కుమారి కమలమ్మ ఉన్నారు.

ప్రజాశక్తి - కందుకూరు : ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన మహిళా పోరు యాత్ర కందుకూరు పట్టణంలో సాగింది. ఈ కార్యక్రమానికి ఐద్వా కందుకూరు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎం పద్మ, ఎస్ కె మల్లికా పద్మ అధ్యక్షత వహించారు. కందుకూరు పట్టణం మూడో వార్డు ఉప్పు చెరువులో జరిగిన సభలో ఎం పద్మ అధ్యక్షత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్కే మస్తాన్‌బీ మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, మహిళలు చిన్నారులపై జరుగు తున్న దాడులను అరికట్టాలని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. జనార్దన్ కాలనీలో జరిగిన సభలో జిల్లా అధ్యక్షులు శివకుమారి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను అదుపు చేయటానికి నిఘాబలంతో కమిటీ వేయాలన్నారు. సుందరయ్య నగర్లో పట్టణ కార్యదర్శి ఎస్కే మల్లిక పద్మ అధ్యక్షత సభ జరిగింది. జిల్లా కమిటీ సభ్యులు శ్యామలమ్మ మాట్లాడారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో జిల్లా నాయకులు ఎస్కే మున్నార్‌సుల్తానా అధ్యక్షత జరిగిన సభలో ప్రమీల మాట్లాడారు. కందుకూరు పట్టణ మహిళా సంఘం నాయకులు ఎస్కే అస్మ ఎస్.కె షాహిదా బి కుమారి పద్మజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిర్మూలించాలని మహిళా పోరుయాత్రను నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బండగానిపల్లి పంచాయతీ ఉదయగిరిలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా పోరుయాత్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా మహిళా కార్యదర్శి మస్తానమ్మ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా జిల్లా అధ్యక్షులు శివకుమారి, శంషాద్, పద్మ, జిల్లా ప్రజానాట్య మండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషయ్య, వేణు, కన్నయ్య, అవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రషీద్, ఐద్వా గౌరవ అధ్యక్షురాలు శ్యామలమ్మ, సిఐటియు మండల కార్యదర్శి తిరుపతయ్య, ఐద్వా కార్యదర్శి కాశ విజయ, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, మహిళలకు ఉపాధి కల్పించాలని మహిళా పోరుయాత్ర ముగింపు సభలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్కె మస్తాన్‌బీ అన్నారు. ఈ సందర్భంగా కోవూరు బజార్ సెంటర్లో మాట్లాడారు. కార్యక్రమంలో శివకుమారి, శ్యామల, షంషాద్, ప్రమీలమ్మ, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం చేస్తున్న కాకర్ల సురేష్

కాకర్ల సురేష్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-ఉదయగిరి

వృద్ధాప్యం అంగవైకల్యం వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కాకర్ల ట్రస్ట్ వ్యవస్థాపకులు నియోజకవర్గం టిడిపి నాయకులు కాకర్ల సురేష్ ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం దుత్తలూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో వృద్ధాప్యంలో ఆర్థిక సమస్యతో బాధపడుతున్న వేముల అంకయ్య సుబ్బమ్మ దంపతులకు, దుండిగ తిరుపతమ్మ, పీట్ల తిరుపతమ్మ లకు ఒక్కొక్కరికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే అంగవైకల్యంతో బాధపడుతున్న దేవండ్ల అంకమ్మకు రూ.10వేలను, వేముల వెంకటరమణమ్మ, చింతలచెరువు చిన్నతిరుపాలుకు రూ.5 వేలను, అనంతరం అదే గ్రామంలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పీట్ల వెంకటేశ్వర్లుకు రూ.10 వేలను, మధురెడ్డి రామిరెడ్డి, చింతలచెరువు తిరుపాలయ్యలకు రూ.5వేలు, షేక్.జుబేదా పిల్లల పైచదువులకు రూ.10వేలు చింతలకుంట్ల వెంకటేశ్వర్లు పిల్లల పైచదువులకు రూ.5వేలు యాక్సిడెంట్లో చనిపోయిన రేంద్ర పిల్లల చదువుకు చుండి చెన్నారెడ్డికి రూ.10వేలను ఆర్థికసాయం అందజేశారు. అనంతరం గ్రామస్తులు కుటుంబ సభ్యులు ఆయనను అభినందించి మీ అభివృద్ధికి తమ వంతు సహకారాలు ఉంటాయని హామీనిచ్చారు. పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, ఏలూరి హనుమంత నాయుడు, పొన్నం కొండప నాయుడు, ఏలూరి రాంబాబు, షేక్. ఖాజావలీ, వెంకట్రామిరెడ్డి, పెద్దిరెడ్డి. చలమారెడ్డి, మీసాల. భాస్కర్, ఆదిరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, ఎర్రంరెడ్డి కొండారెడ్డి, బక్క.శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులకు జగనన్న శ్రీకారం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విధమైన చర్యలు చేపడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నారని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో రూ.95.40లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రత్యేక పూజలు నిర్వహించి మున్సిపల్ పరిధిలో ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా, వ్యవసాయం, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలందరికీ సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికీ అత్యుత్తమ వైద్యులు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కరుణ కుమారి, జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, డాక్టర్ అస్మా, మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు కెవి శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పూర్తి చేయాలి

మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

ప్రజాశక్తి-ఉదయగిరి : ఎన్నికల కమిషన్ 21 నుండి ప్రారంభిచనున్న ఓటర్ల జాబితాను పారదర్శకంగా అధికారులు పూర్తి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి జెడ్పి మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక చెంచల బాబుయాదవ్ అతిథి భవనంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రారంభం కానున్న నూతన ఓటర్ల జాబితాను బిఎల్‌ఒలు పకడ్బంధీగా పారదర్శకంగా చేయాలన్నారు. మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న, మాజీ ఎఎంసి ఉపాధ్యక్షులు బొజ్జ నరసింహులు, యువ నాయకులు సందాని, ఎస్‌సిసెల్ నాయకులు నర్సింహులు, పులిసంధాని, రామ్మోహన్ సుమన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టమోటాలు కేజీ రూ.25లకే ఇవ్వాలి

ప్రజాశక్తి-కావలి : టమోటాలు ధరలు ఆకాశాన్ని అంటినందున ప్రభుత్వం స్పందించి, టమోటాలు, ఇతర కూరగాయలు ప్రభుత్వ చౌకదుకాణల ద్వారా ఇంటి వద్దనే ధరలు తగ్గించి అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్.డి.ఒ. వి.కె.శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రిటైల్ మార్కెట్లో టమోటాల ధరలు రూ.120 విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రజలు కొని, తినలేకున్నారన్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని రేషన్ వాహనాల ద్వారా రైతు బజార్‌లలోనూ, టమోటాలను కేజీ రూ.25లకే సాధారణ ప్రజలందరికీ అందించాలని, అధిక ధరల నుండి ఉపశమనం కలిగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వ్యకాసం మండల నాయకులు సీతా రామయ్య, కెవిపిఎస్ నాయకురాలు కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'ఆశా'లు నిరసన

నిరసన చేపడుతున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి-కావలి

ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు మంగళవారం నెల్లూరులో డిఎంఅండ్‌హెచ్‌ఒ ఆఫీసు వద్ద జరుగుతున్న ఆశ వర్కర్ల ఆందోళనకు కావలి నుండి ఆశ వర్కర్లను వెళ్లనివ్వ కుండా ఇక్కడి అధికారులు ఆపడంతో అందుకు నిరసనగా కావలి ఏరియా హాస్పిటల్ వద్ద సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవ అధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్లు న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం ఆందోళనకు నెల్లూరుకు వెళ్లకుండా ఇక్కడ అధికారులు ఆశా వర్కర్లను ఆపడంతో ఇదేమిటని ప్రశ్నించడంతో "ఇది రాష్ట్ర ప్రభుత్వ డైరెక్షన్" అని చెప్పడం చాలా దుర్మార్గమైన విషయమన్నారు. ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆశా వర్కర్లు చేయాల్సిన పనులు కాకుండా రకరకాల పనులు చెబుతూ ఆశలపై పని భారం పెంచారన్నారు. రు.10వేలు వేతనం ఇచ్చి ఉదయం నుండి సాయంత్రం 6 గంటల వరకు సెంటర్లలో ఉండే పనులు చేయాలని చెప్పడం, వారిపై ఒత్తిడి తీసుకొని రావడం ఇది చాలా అన్యాయమని తెలిపారు. కొత్త సెల్‌ఫోన్‌లను ఆశ వర్కర్లని కొనుక్కొని పనులు చేయాలని, లేకుంటే ఉద్యోగాల నుండి తీసి వేస్తామని అధికారులు బెదిరించడం చాలా విచారకరమైన విషయమన్నారు. ఇంకా వారి సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు టి వసుంధర దేవి, అన్నమ్మ, గాయత్రి, సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్, నాయకులు జి.మధుసూదన్ రావు, పెంచలనరసింహ, ఆశవర్కర్లు, తదితరులున్నారు.

ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి బిట్రగుంట : ఉత్తమ మండల విద్యాధికారి అవార్డు గ్రహీత వి.జయంతి బాబుకు వీడ్కోలు సభను మంగళవారం ఎంఇఒ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు ఆయన చేసిన మంచి పనుల గురించి కొనియాడారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 జయమ్మ, ఎంపిడిఒ సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో ఎంఇఒగా ఉత్తమ ఉపధ్యాయులుగా పనిచేసి, ఎంతో అభిమానం చేకూర్చుకున్నారని, ప్రతీ విద్యార్థినీ, విద్యార్థులు చక్కని విద్యతో పాటు మంచి నేర్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 నరసింహ మూర్తి, దగదర్తి ఎంఇఒ భాస్కరరావు, జలదంకి ఎంఇఒ శ్రీధర్, హెడ్మాస్టర్లు గంగాధర్, కనకారావు, రవీంద్రనాథ్, ఠాగూర్, ప్రయివేట్ స్కూల్స్, స్కూల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపిసెట్టి హరి, సాధనాల మనోహర్ నాయుడు, ఎంకెఎస్, చంద్ర, ఉపాధ్యాయులు ఆవుల కిషోర్, పబ్లిక్ స్కూల్ టి.అరుణ, పి.రాము శాంభవి స్కూల్ జువ్వలదిన్నె, హోలీ ఫ్యామిలీ స్కూల్ ఎస్.సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్‌ఎను కలిసిన మేకపాటి

ప్రజాశక్తి-జలదంకి

మాజీ ఎంఎల్ఎ వంటేరు వేణుగోపాల్‌రెడ్డిని మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంటేరు వేణుగోపాల్ రెడ్డి నాయకులను, కార్యకర్తలను ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డికి పరిచయం చేశారు.

క్రికెట్ కిట్లు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎసిఎస్ఆర్ కాలనీకి చెందిన యువత తమకు క్రికెట్ కిట్లు కావాలని ఎంఎల్ఎను మేకపాటి విక్రమ్‌రెడ్డిని కోరడంతో స్పందించిన ఆయన వారికి కిట్లను మంగళవారం ఆత్మకూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మంగళ వారం జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆత్మకూరుకు విచ్చేసిన ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎసిఎస్ఆర్ కాలనీలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మధ్యాహ్నం క్యాంపు కార్యాలయానికి యువతను పిలిపించి వారికి రెండు క్రికెట్ కిట్ లను అందచేసి ప్రోత్సహించారు. ఈ మేరకు ఎంఎల్ఎకు యువకులు, నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని బూదవాడ గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జి తహశీల్దారు ఆనందరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మస్తాన్‌ఖాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సచివాలయాల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ అర్హులై ఉండి సరైన సర్టిఫికెట్లు లేని వారికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, సర్పంచ్ మంచాల హరిబాబు, ఉప సర్పంచ్ సిరిగిరి ఈశ్వర్ రెడ్డి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు చప్పిడి రమణమ్మ, సచివాలయ కన్వీనర్లు కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఝాన్సీ రాణి, సిద్ధారెడ్డి, ఏపిలిగుంట ఎంపిటిసి హజరత్ రెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, పెగళ్లపాడు సర్పంచ్ చెవుల శ్రీనివాసులు యాదవ్, వైసిపి నాయకులు బేరి రామ్మోహన్ రెడ్డి, చింతకుంట రామకృష్ణారెడ్డి, అబ్దుల్లా నాగూర్, సోషల్ మీడియా కో కన్వీనర్ ఓంకారం శివ, ఆర్ఐ సురేంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : జనతాపేట నార్త్ 22వ సచివాలయం పరిధిలోని 29, 31 వార్డులకు సంబంధించి మంగళవారం "జగనన్న సురక్ష" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ కిరణ్, వార్డ్ ఇన్‌ఛార్జులు పెనుమల్లి అశోక్, టి.ప్రభాకరనాయుడు, వై.సి.పి. నాయకులు కనుపర్తి రాజశేఖర్, గుర్రం వెంకటేశ్వర్లు, పొనుగోటి అనురాధ, జెవింతా ప్రభాకరరెడ్డి, కృష్ణ, పుత్తూరు నాగాచారి, శారద, సచివాలయ సిబ్బంది, పోలీసు, వైద్య సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదరికాన్ని దూరం చేస్తున్నారని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎసిఎస్ఆర్ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కరుణ కుమారి, మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, ఐవి రమణారెడ్డి, నోటి వినయ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్ కొండా స్వరూపరాణి, ఎస్‌సిసెల్‌అధ్యక్షుడు కొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఆత్మకూరుఅర్బన్ : ప్రజల సమస్యలు పరిష్కరించడమే జగనన్న లక్ష్యంగా ప్రభుత్వ పథకాలను తీసుకురావడం జరుగుతుందని ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నువ్వూరుపాడు గ్రామంలో జగనన్న సురక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్వయం సహాయక గ్రూపుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని ఉదయగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం సీతారామపురం బిట్-2 సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి, జెడ్‌పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డి, మండల వైసిపి కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, వైస్ ఎంపిపి నేలటూరి సారమ్మ, జెడ్పి కోఆప్టడ్ మెంబర్ గాజుల తాజుద్దీన్, మాజీ ఎంపిపి నేలటూరి అబ్రహాం, మాజీ వైస్ ఎంపిపి రామిశెట్టి తిరుపతయ్య, సర్పంచులు కొడవటి కంటి భాగ్యమ్మ, చప్పిడి తిరుపతిరెడ్డి, ఎంపిటిసి వెంకటసుబ్బమ్మ, పిఆర్‌డిఇ సుబ్బారెడ్డి, ఎంపిడిఒ రంగ సుబ్బరాయుడు, ఎంఇఒ మస్తాన్‌వలీ, తహశీల్దారు షాజియాబేగం పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కోవూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సురక్ష కార్యక్రమం ఒక పండగను తలపిస్తుందని రాష్ట్ర వ్యవసాయసలహా మండలి సభ్యులు దొడ్డంరెడ్డి నిరంజన్ బాబు రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ శ్రీహరి, తహశీల్దార్ పద్మజ, జెడ్‌పిటిసి శ్రీలత, ఎఎంసి చైర్మెన్ పచ్చిపాలరాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, వైస్ ఎంపీపీ శివునినరసింహరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : మధ్యవర్తుల్లేని సమాజంలోనే పేదల అభివద్ధి సాధ్యమని ఆ దిశగానే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు స్పష్టం చేశారు. మండలంలోని నార్తు రాజుపాలెం మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ట్రైనీ కలెక్టర్ సౌజన్య, తహశీల్దార్, ఎంపీడీఓలు రమాదేవి, పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, కార్యదర్శి జి.జాలయ్య, సచివాలయ కన్వీనర్ కొండా శ్రీనివాసులు రెడ్డి, నాయకులు మోహన్ రావు జనార్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లూరు : రైతుల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గుడ్లూరులోని సచివాలయం దగ్గర జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎంఎల్ఎ మహీధర్ రెడ్డి మాట్లాడుతూ పొలానికి సంబంధించిన వన్ బి అడంగులు మ్యుటేషన్ పత్రాలు రైతులకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంపిడిఒ చంద్ర, తహశీల్దార్ సూర్య నారాయణ సింగ్, వైద్యాధికారి మారుతిరావు, ఏవో రవి, వీఆర్వో చలమారెడ్డి, కార్యదర్శి మహేష్ ఉన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం బ్రాహ్మణ క్రాక అగ్రహారం సచివాలయంలో సర్పంచ్ ఇండ్ల సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఎ వంటేరు వేణుగోపాల్ రెడ్డి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లను అందజేశారు. మండల రెవెన్యూ అధికారి, ఎపిఒ, హౌసింగ్ ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఇఒఆర్‌డి, విఆర్‌ఒలు, పంచాయతీ సెక్రటరీ నీరజ, బ్రాహ్మణక్రాక అగ్రహారం ప్రజలు నాయకులు బండారు తిరుపతి రెడ్డి, రవిరెడ్డి, పాండురంగా రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, వంటేరు నందగోపాల్‌రెడ్డి, రాకేష్ రెడ్డి, కావలి మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు సచివాలయం బిట్-2లో సర్పంచ్ పి.అనిత ఆధ్వర్యంలో జక్కేపల్లిగూడూరుల సచివాలయంలో సర్పంచ్ బండ్ల సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, ఎంపిడిఒ వెంకట సుబ్బారావు పాల్గొని అర్జీదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మద్దిబోయిన కీర్తన, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా అందిస్తున్న 11 ఉచిత సర్వీసులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం అప్పసముద్రం సచివాలయం పరిధిలో జగనన్న సురక్షలో భాగంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి, తహశీల్దార్ జగదీష్ బాబు, ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ మల్లికార్జున, దాసరిపల్లి సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపిటిసి సుభాన్, అగ్రికల్చర్ ఎఒ ఆంజనేయ నాయక్, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేయడమే జగనన్న సురక్ష ధ్యేయమని ఎంపిడిఒ శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని చామదల సచివాలయం ఆవరణలో జగనన్న సురక్షను సర్పంచ్ పలుకూరి సీతారామమ్మ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో డిటి భరత్ కుమార్, పి ఆర్ ఎఇ వై ఇరిగేషన్ ఎఇఇ కే.శివారెడ్డి, ఎపిఎం శ్రీధర్‌రావు, జెడ్‌పిటిసి శివలీలమ్మ, ఎంపిటిసిలు దేవరపల్లి విజయ్ భాస్కర్ రెడ్డి, పసుపులేటి ప్రసాదు, గ్రామ కార్యదర్శి బి.బుజ్జమ్మ, విఆర్‌ఒ వడ్డే మాలకొండయ్య, సచివాలయం కన్వీనర్లు పలుకూరి వెంకటేశ్వర్లు, వంటేరు చిన్నలక్ష్మీ నరసారెడ్డి, తదితరులున్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు వాటి అమలుపై అధికారులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వైసిపి రెండవ వైస్ ఎంపిపి దేవరబోయిన మధు, తన ప్రసంగాన్ని వినిపించేందుకు సన్నద్ధం కాగా అవతలి వర్గం వారు అడ్డుకున్నారు. ఇక్కడ మాట్లాడాల్సిన అవసరం లేదని వారు భీష్మించుకున్నారు. తాను ప్రజాప్రతినిధునని, తనను ఎందుకు మాట్లాడనివ్వరని, ఇది ప్రజాస్వామ్యం కాదని, రెండో వైస్‌ఎంపిపి మండిపడ్డాడు. తన ఎంపిటిసి పరిధిలో అంటే మూడు గ్రామాలకు సంబంధించి జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎందుకు పాల్గొని ప్రసంగించలేదని, కేవలం ప్రచారం కోసం ఇలా చేయడం కరెక్ట్ కాదని తిమ్మరెడ్డి పల్లి, టి.కొండారెడ్డి పల్లికి చెందిన పలువురు నాయకులు మండిపడ్డారు. అనంతరం అధికారులు సర్ది చెప్పి కూర్చోబెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి గవరకట్ల వెంకట లక్ష్మమ్మ, తహశీల్దార్ సయ్యద్ ఇగ్బాల్, ఎంపిడిఒ విజయభాస్కరరావు, ఎంపిటిసి వసంతమ్మ, సర్పంచ్ నారాయణమ్మ, టి.కొండారెడ్డిపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం చిన్నదైనా సాహిత్య, కళా సాంస్కృతిక సంబంధించి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారని రచయిత, జర్నలిస్ట్, పొనుగోటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నా ఫౌండేషన్ సామాజిక సంస్థ అధిపతి లేబాకుల సుధాకరరెడ్డి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గత ఆదివారం ఉదయం బృందావనం కాలనీ కళ్యాణ మండపంలో ప్రముఖ రచయిత "వివిన మూర్తి" రచించిన 'వివేచన' పుస్తకాన్ని నా ఫౌండేషన్ వారు ముద్రించి, ఆవిష్కరింప చేశారు. ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ చేత ఆవిష్కరింప చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి డాక్టర్ మనం వెంకటనాయుడు, పుస్తక రచయిత వివినమూర్తి, పుస్తకావిష్కరణ కర్త పెనుగొండ లక్ష్మీనారాయణ, కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖుల అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

CHANGE OF NAME

I, VALETI RAVINDRANATH GUPTHA son of VALETI KRISHNAMURTHI (Old Name) resident of H No:213, Achari Street, NELLORE City, SPSR Nellore Dist. A.P. hereby declare that in my Passport No. **L 4706217** my father name has been wrongly written as Krishnamurthi Valeti. The actual name of my father is **SRI KRISHNAMURTHY VALETI** (New Name) belongs to his Aadhaar & Death Cerificate.

డాక్యుమెంటు పోయినది

నాగేళ్ళ కిషోర్ నాగ్, తండ్రి **రామకృష్ణ,** రంగనాయకులపేట, నెల్లూరు సిటీ. అను నేను **తేది: 5-7-2023** న నా ఒరిజినల్ రిజిష్టరు **డాక్యుమెంటు నెం.4481/2006** రంగనాయకులపేటలోని మా ఇంటి వద్ద నుండి సంతపేట సెంటర్‌లో జెరాక్స్ తీసుకుని **సి.ఎం.ఆర్. షాపింగ్ మాల్** దగ్గరకు పోవుచుండగా మార్గమధ్యలో జారి పడిపోయినది. ఈ ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంటు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

నాగేళ్ళ కిషోర్ నాగ్, తండ్రి **రామకృష్ణ,**
రంగనాయకులపేట, నెల్లూరు సిటీ.
సెల్: **8978334451, 9059939799**

ప్రకటన

నా క్లయింట్ అయిన **జక్కుల లక్ష్మీ సంజన** తండ్రి **ప్రశాంత్,** నివాసం: దేవాంగపాళెం, యల్లాయపాళెం, కొడవలూరు మండలం, **SPSR** నెల్లూరు జిల్లా అనువారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్‌కు ఈక్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి **లైన లక్ష్మమ్మ భర్త లేట్ లైన రమణయ్య** గారి వద్ద నుండి **రిజిష్టరు వీలునామా తేది 08-09-2017 దాక్యుమెంటు నెం. 382/BK III/17** ద్వారా సంక్రమించినదని, సదరు **లైన లక్ష్మమ్మ** గారు **మేడా పుల్లారెడ్డి** గారి వద్ద కొనుగోలు చేసిన ఆస్తి యొక్క **రిజిష్టర్డు విక్రయ పత్రం తేది 15-07-1992 దాక్యుమెంటు నెం. 411/1992** మరియు **మందిపాటి వెంకట సుబ్బమ్మ** గారి వద్ద కొనుగోలు చేసిన ఆస్తి యొక్క **రిజిష్టరు విక్రయ పత్రం తేది 14-02-1996 దాక్యుమెంటు నెం.198/1996** ద్వారా కొనుగోలు చేసినారు. నా క్లయింట్ పైతెలిపిన ఒరిజినల్ వీలునామా మరియు రెండు రిజిష్టర్డు విక్రయ పత్రములును కవరులో పెట్టుకొని ఆటోలో **తే 02-06-2023దిన** యల్లాయపాళెం నుండి నార్త్‌రాజుపాళెంకు పోవుచుండగా మార్గమధ్యములో పోయినవి. పై తెలిపిన ఒరిజినల్ రిజిష్టర్డు వీలునామా, మరియు రెండు రిజిష్టర్డు విక్రయ పత్రములు ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇవ్వవలసినదిగా కోరడమైనది. మరియు క్రింది దాఖలా ఆస్తిపై ఎవ్వరికైననూ ఎలాంటి ఆక్షేపణలు/ అభ్యంతరములు మరి ఏ ఇతరములైన వున్న యెడల ఈ పత్రికా ప్రకటన తేది నుండి 7 రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

నెల్లూరు రి॥డి॥ యిలాకా, బుచ్చిరెడ్డిపాళెం స॥రి॥లో చేరిన కొడవలూరు మండలం, యల్లాయపాళెం గ్రామ పంచాయితీలో చేరిన యల్లాయపాళెం గ్రామంలోని నెం.24రు పట్టా దాఖలా సర్వే నెం.674రు లో య1-32ట్లు, సర్వే నెం.673/బి రులో య0-56ట్లు, సర్వే నెం.673/సి రులో య0-54ట్లు వెరశి య2-42ట్లు లేక 0.980 హెక్టార్లు మాగాణి భూమికి **హద్దులు: తూర్పు:** పొరుదల కాలువ, **దక్షిణం:** రోడ్డు, **పడమర** : పొరుదల కాలువ, **ఉత్తరం** : పొరుదల కాలువ.

G.S.R.రవితేజరెడ్డి, B.Com., L.L.M.,
అడ్వకేట్,
డోర్ నెం.15-6-69, మొదటి అంతస్తు,
మినిబైపాస్ రోడ్డు, వెంకట్రామాపురం
నెల్లూరు, సెల్: **70134 55477**